నకిలీ మద్యంపై నిరసనాగ్రహం

- కదం తొక్కిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దని నినాదాలు
- నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్



నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు, కార్యకర్తలు

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం విచ్చలవిడిగా నకిలీ మద్యం విక్రయాలు సాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని నందిగామ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నకిలీ మద్యం విక్రయాల ద్వారా కూటమి నాయకులు ప్రజల ప్రాణాలను పణంగాపెడుతూ తమ జేబులను నింపుకుంటున్నారని మండిపడ్డారు. కంచికచర్లలో సోమవారం వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు వేమా సురేష్‌బాబు, బండి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, మహిళలు కలసి జుజ్జూరు రోడ్డు నుంచి ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుంటే సీఎం చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ గాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాని స్పందించడం లేదని ఆరోపించారు. స్త్రీశక్తి అంటూ స్త్రీలకు ప్రాధాన్యత అంటూ చెప్పే సీఎం చంద్రబాబు పాలనలో ఈ నకిలీ మద్యం విక్రయాల కారణంగా స్త్రీల మెడల్లో తాళిబొట్లు ఉంటాయో? లేదో? తెలియని పరిస్థితి నెలకొందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ షేక్‌అష్రఫున్నీసా బేగంను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కంచికచర్ల జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు, నందిగామ ఎంపీపీలు షేక్ మలక్‌బషీర్, కోటేరు శ్రీలక్ష్మి, గుడేటి నాగమల్లేశ్వరి, పెసరమల్లి రమాదేవి, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, వేమా శివకోటి, కాలవ వాసుదేవరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ షహనాజ్‌బేగం, పార్టీ జిల్లా అంగనవాడీ విభాగం అధ్యక్షురాలు శాఖమూరి వెంకటకుమారి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు, రాయల నరసింహారావు, వేమవరపు పురుషోత్తం, పాపట్ల స్వామి, వేల్పుల రమేష్, మంగళాపూడి కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటలపాటు రోడ్డుపై హైడ్రామా

కంచికచర్ల : నకిలీ మద్యాన్ని అరికట్టాలంటూ శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే తమను అడ్డుకుని పోలీస్ కారులో ఎక్కిస్తారా? అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కంచికచర్ల పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నకిలీ మద్యం తయారు చేసి విక్రయించిన దోషులను కఠినంగా శిక్షించాలంటూ కంచికచర్లలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం శ్యాంతియుతంగా ర్యాలీ చేసి అనంతరం నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసేందుకు వెళ్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. రూరల్ సీఐ చవాన్‌దేవ్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు ఎస్‌ఐలు పీ విశ్వనాథ్ అనిల్‌కుమార్, ధర్మరాజు ఒక్కసారిగా వచ్చి డాక్టర్ జగన్‌మోహన్‌రావును బలవంతంగా పోలీస్ కారులోకి ఎక్కించడంతో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అడ్డుకున్నారు. తమ నాయకుడిని అన్యాయంగా ఎందుకు కారులో ఎక్కించారంటూ మహిళలు సీఐ చవాన్‌ను ప్రశ్నించారు. ఈక్రమంలో మహిళా నాయకులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని వారిని సైతం పోలీసువాహనంలో ఎక్కించారు. దీంతో రెండు గంటలపాటు రోడ్డుపై హైడ్రామా నడిచింది.

మహిళా కానిస్టేబుల్ కూడా లేకుండా తమను అదుపులోకి ఎలా తీసుకుంటారంటూ ప్రశ్నించిన మహిళలను పోలీసులు దుర్భషలాడారు. ఈక్రమంలో సీఐ ఆదేశాలతో పోలీసుకారు డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడపడంతో ఓ నాయకుడు గాయపడ్డాడు. అనంతరం పోలీసులు తమ వాహనాన్ని వీరులపాడు మండలం పొన్నవరం మీదుగా కంచికచర్ల మండలం పేరకలపాడు మార్గంలో నేషనల్ హైవే వద్దకు వచ్చి కీసర బ్రిడ్జి వద్ద కారును ఆపి డాక్టర్ జగన్‌మోహనరావుతో పాటు మహిళలను అక్కడ విడిచిపెట్టారు. అయితే స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం కోసమే పోలీసులు ఇలా వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపించాయి.

అసలులో కలిసిపోయిన నకిలీ మద్యం


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

కంచికచర్ల: నకిలీ మద్యం బాటిళ్ల మూతలు, లేబుళ్లు కూడా అసలు మద్యం బాటిళ్ల మాదిరిగా ఉంటుండటంతో రాష్ట్రంలో ఏది అసలు, ఏది నకిలీ మద్యమో కనుక్కోలేని దుస్థితి నెలకొందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విమర్శించారు. నకిలీ మద్యం తయారీ కేసులోని దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కంచికచర్లలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు తాగే రూ.99 నుంచి రూ.130ల మధ్య ధర ఉండే మద్యానికి కూటమి నాయకులు నకిలీలు సృష్టిస్తున్నారని చేస్తున్నార ఆరోపించారు. తద్వారా పేదల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

'ఎస్' బ్రాండ్ పేరుతో మద్యం సరఫరా...

గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యంప్రియులకు 'ఎస్' బ్రాండ్ నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తున్నారని డాక్టర్ జగన్‌మోహనరావు మండి పడ్డారు. వందశాతం స్పిరిట్ ఉండే ఎస్ బ్రాండ్ మద్యాన్ని అమ్ముతున్నారని ఆరోపించారు. రోజంతా కష్టం చేసేవారు సాయంత్రం బడలిక తీర్చుకునేందుకు తాగే మద్యాన్ని కూడా కూటమి నేతలు నకిలీ చేస్తుండటంతో అది విషంగా మారుతోందన్నారు. ఏడాదిన్నరగా రాష్ట్రంలో రోజూ పదుల సంఖ్యలో మద్యం తాగిన పేదలు అనారోగ్యం పాలై మృత్యువాతపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందన్నారు. నకిలీ మద్యం సూత్రధారి టీడీపీ నాయకులు అద్దేపల్లి జనార్దనరావు, కట్టా రాజు ఈ ప్రాంతానికి బెల్టుషాపుల ద్వారా మద్యాన్ని విక్రయిస్తున్నారని మండిపడ్డారు. కూటమి నేతల కనుసన్నల్లో నకిలీ మద్యం తయారు చేసి గ్రామాలకు నేరుగా డెలివరీ చేసి లక్షల్లో ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారని విమర్శించారు. తక్కువ ధరకు ఎలా మద్యాన్ని తయారుచేయవచ్చో సీఎం చంద్రబాబు, ఆయన అనుచరులను చూసి డిస్టిలరీల యజమానులు కూడా నేర్చుకోవాలన్నారు. బెల్టుషాపుల ద్వారా రాష్ట్రంలో 2.25 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

సీబీఐతో విచారణ చేయించాలి : తన్నీరు


నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పేటలో బైక్‌లతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న తన్నీరు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నకిలీ మద్యం వ్యవహారంలో పూర్తి వివరాలు వెలుగు చూడాలంటే సీబీఐ చేత విచారణ చేయించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నారా వారి కల్తీ మద్యం పాలన నశించాలని డిమాండ్ చేస్తూ జగ్గయ్యపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పోరుబాట కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆపార్టీ జగ్గయ్యపేట ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తొలుత పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తొర్రగుంటపాలెంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సిట్ దర్యాప్తులో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఉన్నందున రూ.50 వేల కోట్ల ఈ నకిలీ మద్యం కుంభకోణంపై తక్షణమే సీబీఐ చేత విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి పాలనలో నకిలీ మద్యం ఏరులైపారుతోందన్నారు. నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వం అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోందని మండిపడ్డారు. నకిలీ మద్యం తయారీని సీఎం చంద్రబాబు సర్కార్ కుటీర పరిశ్రమలా మార్చిందని ఆరోపించారు. నకిలీ మద్యం వ్యవహారం రాష్ట్రంలో ఎక్కడ వెలుగుచూసినా అందులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిందితులుగా ఉంటున్న వైనాన్ని గుర్తుచేశారు. అందుకే లిక్కర్ షాపులు, బెల్ట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించకుండా చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారని ఆరోపించారు. నకిలీ మద్యం కారణంగా మృతిచెందిన వారిని గుర్తించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పార్టీ నాయకులంతా కలిసి జగ్గయ్యపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


పేట ఎక్సైజ్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు



కంచికచర్ల ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు


కంచికచర్ల ర్యాలీలో డాక్టర్ జగన్‌మోహనరావును అడ్డుకుంటున్న పోలీసులు


డాక్టర్ జగన్‌మోహనరావు, మహిళా నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


తమ నేతలను తీసుకువెళ్లడానికి వీలులేదంటూ అడ్డుకుంటున్న నాయకులు



డాక్టర్ జగన్‌మోహనరావు, మహిళా నాయకులను తమ వాహనంలో తరలిస్తున్న పోలీసులు

తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

నందిగామ టౌన్: నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కంచికచర్లలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి నందిగామ, చందర్లపాడు మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో పలు వాహనాల్లో కంచికచర్లకు చేరుకుని నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, షేక్ యాకుబ్‌అలీ, శాఖమూరు వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత



మక్కపేట(వత్సవాయి): మొక్కలను విరివిగా పెంచితే కాలుష్యం దరిచేరదని, మొక్కలు నాటడాన్ని అందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.ప్రసూన, కేవీకే శాస్త్రవేత్త ఆర్.ప్రభావతి సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సామాజిక విజ్ఞాన కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మక్కపేటలో వంద మొక్కలు నాటారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు గ్రామంలో ముఖ్యమైన ప్రదేశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను అందరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 12 అర్జీలు



నందిగామరూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 12 అర్జీలు అందాయని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి మూడు అర్జీలు, సర్వే విభాగం నాలుగు, పంచాయతీ రాజ్ ఒకటి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఒకటి, ఇరిగేషన్ ఒకటి, సివిల్ సప్లై ఒకటి, ట్రెజరీకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. అర్జీలను ఆయా శాఖాధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు.

నందిగామలో మోస్తరు వర్షం

నందిగామ రూరల్: నందిగామ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా జల్లులు కురవడంతో ప్రజలు ఒకింత ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని రహదారులు చిత్తడిగా మారాయి. గడిచిన మూడు రోజుల నుంచి వర్షం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపడతాం : డీఈ

సాక్షి ఎఫెక్ట్

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ఈనెల 12వతేదీన 'అధ్వాన్నంగా ముచ్చింతాల-తాళ్లూరు రోడ్డు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. వర్షాలు, వరదలకు దెబ్బతిన్న రహదారి మరమ్మతులకు రూ.2.25 కోట్లతో అంచనాలు తయారు చేశామని జగ్గయ్యపేట ఆర్అండ్‌బీ డీఈ పరుశరాముడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు మరమ్మతు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని డీఈ వివరించారు.

మునేరుకు భారీ వరద



పెనుగంచిప్రోలు: ఎగువన తెలంగాణలో కురుస్తున్న వర్షాల కారణంగా మునేరుకు అకస్మాత్తుగా భారీగా వరద నీరు వస్తోంది. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు వస్తోంది. దీంతో మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెనుగంచిప్రోలు మండల అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

జగ్గయ్యపేట: దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయంచే దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ సోమవారం సూచించారు. బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు పోలీస్, రెవెన్యూ, ఫైర్ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్డులోని ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల్లో అన్ని శాఖల అధికారులతో కలిసి దుకాణదారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ఆయన వివరించారు.

దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

నందిగామటౌన్: సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌కు దేశ బహిష్కరణ విధించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చల కూర పుష్పరాజ్ డిమాండ్ చేశారు. సీజేపై జరిగిన దాడి యత్నాన్ని ఖండిస్తూ నందిగామ న్యాయ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో స్థానిక గాంధీసెంటరులో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలను అందరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సమత క్లబ్ జిల్లా గవర్నర్ కెజెడ్ఎస్ కుమార్, మసీదు ముతావలి షేక్ ఖాజా, జాషువా ఫౌండేషన్ ప్రతినిధి కోట రవీంద్రనాద్, వామపక్ష నాయకులు చుండూరు సుబ్బారావు, సయ్యద్ ఖాశీం, న్యాయవాదులు కన్నెకంటి జీవరత్నం, నంద్రు బాబూవిద్యాసాగర్, కోట దేవదాసు, నంద్రు శ్రీరామ్మూర్తి, అద్దంకి మణిబాబు, మిక్కీ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి సుందర్, బర్రె ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఈవో తదితరులు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో భక్తుడు సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న ఆర్వో ప్లాంట్‌కు సోమవారం ఆలయ ఈవో సురేష్‌బాబు భూమిపూజ చేశారు. చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామానికి చెందిన ఉన్నం గిరిధర్ భక్తుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయిస్తున్నట్లు ఈవో వివరించారు. వాటర్ ప్లాంట్ పనులు వారంరోజుల్లో పూర్తవుతాయని ఈవో వివరించారు. కార్యక్రమంలో కేసీపీ ప్రెసిడెంట్ రామ్‌ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీటీల వ్యాపారి కనిపించకపోతుండటంపై ఫిర్యాదు

పెనుగంచిప్రోలు: చీటీలు కట్టిన డబ్బులతోపాటు గోల్డ్ స్కీమ్ పేరుతో తమనుంచి డబ్బులు కట్టించుకున్న వ్యక్తి కొద్దిరోజులుగా కనిపించడం లేదంటూ గ్రామానికి చెందిన పలువురు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అర్జున్ కథనం మేరకు... గ్రామానికి చెందిన వ్యాపారి చెన్నా దుర్గారావు తూర్పు బజారులో ఎలక్ట్రికల్, ఫర్నీచర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. పలురకాల స్కీమ్‌ల నిర్వహిస్తూ ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. వడ్డీకి కూడా అధికమొత్తంలో నగదు తీసుకున్నాడు. ఈక్రమంలో కొద్దిరోజులుగా చెన్నారావు ఎవ్వరికి కనిపించకుండా పోవడంతో బాధితులు సోమవారం పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ అర్జున్ వివరించారు.

జీఎస్టీ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుంది: ఎమ్మెల్యే

జగ్గయ్యపేట అర్బన్: జీఎస్టీ విధానం దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చడంలో కీలకపాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పౌరుడు పన్నులు చెల్లించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఆర్. రాఘవేంద్ర, కమిషనర్ కృష్ణారావు, శ్రీరాం సుబ్బారావు, ఎంపీడీవో నితిన్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నసరత్ జాహ, కంచేటి గీతారాణి, ఎస్. బుజ్జిబాబు, వెంకట్, నీలకంఠం ప్రసాద్, కర్ల జోజి, వేముల శ్రీను, పోతిపాక వెంకటేశ్వర్లు, చిట్యాల మల్లయ్య, కె.మల్లికార్జునరావు, మారేపల్లి శౌరి, వర్మ, షేక్ ఉమ్మర్, కాకాని బాలకృష్ణ, నారపోగు కొండ, వడేఘర్ ప్రకాష్ పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు


గండేపల్లిలో బోర్లకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు, పక్కన సర్పంచి రవికుమార్

గండేపల్లి(కంచికచర్ల): గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. గండేపల్లిలో పనిచేయని నాలుగు బోర్లకు సోమవారం మరమ్మతులు చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా ప్రజలకు రోజూ నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మెకానిక్‌లు పుల్లారావు, సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి : ఎంఈఓ



పెనుగంచిప్రోలు: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని ఎంఈఓ డి.రవీంద్ర సూచించారు. స్థానిక ఎస్ఎస్‌పైపీఎం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జరుగుతున్న ఫార్మేటివ్- 2 పరీక్షలను సోమవారం ఆయన పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ వివిధ సామర్థ్యాలతో మూల్యాంకనం కోసం ప్రత్యేకంగా మూల్యాంకన పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం నక్కా బాబూరావు, ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, స్వాతిశిల్ప, వేగినేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

190 మందికి వైద్య పరీక్షలు

నందిగామరూరల్: మండలంలోని కొణతమాత్మకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమరావతి కంటి ఆస్పత్రి, గాయత్రి హాస్పిటల్ వైద్యులు మొత్తం 190 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు కృష్ణారావు, షర్మి, వర్ధిని, నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, భాస్కరరావు పాల్గొన్నారు.